## అందుబాటులో జనుము విత్తనాలు

నర్సాపూర్,మే28ః మండల పరిధిలోని నత్నాయిపల్లి పరిశోధన స్థానంలో జనుము విత్తనాలు అందుబాటులో కలవని శాస్త్రవేత్త శోభ వెల్లడించారు. ఈ సంధర్బంగా ఆమె మాట్లాడుతూ కిలో విత్తనం ధర రూ.95, ప్యాకింగ్ సైజ్ 30 కిలోలుగా కలదని తెలిపారు. అవసరమైన రైతులు వ్యవసాయ పరిశోధన స్థానం నత్నాయిపల్లికి వచ్చి విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 9440632805 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

శివ్వంపేట, మే 28 : మండలంలోని లింగోజిగూడ గ్రామానికి చెందిన కొమిరగారి యాదయ్యకు చెందిన గేదె పొలం వద్ద మేత మేస్తున్న క్రమంలో విధ్యుత్‌వైర్లు తెగి పడడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే గేదె మృతి చెందింది. దీంతో యాదయ్య రూ. 80వేల విలువ చేసే గేదె కోల్పోయానని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

## బాధిత కుటుంబాలకు వేర్వేరుగా సహాయాలు

రామాయంపేట, మే 28ః రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామంలోని అనారోగ్యానికి గురై మృతి చెందిన బాధిత కుటుంబానికి సంఘ సేవకుడు గట్టు ప్రశాంత్ ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం గ్రామంలోని ఆనారోగ్యంతో మృతి చెందిన మల్లిగారి దేవయ్య కుటుంబానికి రూ.4వేలను అందించి ఆదుకున్నారు. రామాయంపేట పట్టణంలోని హరిజన కాలనీలోని మృతి చెందిన చేపూరి దుర్గయ్య కుటుంబ సభ్యులకు రూ.15వేలను ఇందిరా యూత్ క్లబ్ సభ్యులు అందజేశారు. కార్యక్రమాల్లో గావు సురేందర్, ఎర్ర రాజేందర్, రాములు, పాతూరి సాయి, చందు, నరేశ్, ప్రశాంత్, నర్సింహులు, సంజీవ్, రమేష్, ఆనంద్, శేరిపల్లి భూదయ్య ఉన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలు



రోడ్డుపై పడిపోయిన క్షతగాత్రుడు

రామాయంపేట, మే 28ః గుర్తుతెలియని వాహనం డీకొని ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన రామాయంపేట పట్టణంలోని మంగళవారం రాత్రి జరిగింది.పట్టణంలోని కేసీఆర్ కాలనీకి చెందిన శ్యాంసింగ్ కాలినడకన కాలనీకి వస్తున్నాడు. మార్గమద్యంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకోగానే వెనుక నుండి వచ్చిన గుర్తతెలియని వాహనం డీకొట్టింది.ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన శ్యాంసింగ్‌ను వెంటనే స్థానికులు 108 అంబులెన్సులో ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్సలు నిర్వహించారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నిజాంపేట మండలంలోని నందగోకుల్లో కొన్ని రోజుల క్రితం బిఆర్‌ఎస్ కార్యకర్త అంద మహేష్ కు కరెంట్ షాక్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బిఆర్‌ఎస్ నాయకుడు కంటరెడ్డి తిరుపతి రెడ్డి స్థానిక బిఆర్‌ఎస్ నాయకుల ద్వారా బాధ్యుడికి రూ.5000 అందజేశారు. కార్యక్రమలో నాయకులు ఉన్నారు.


## 31న చలో వరంగల్

చిలిపిచెడ్, మే 28: మందకృష్ణ మాదిగకు రాష్ట్రపతి పద్మశ్రీ పురస్కారం స్వీకరించడం చాలా సంతోషకారం అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన చిలిపిచెడ్‌కు జిల్లా అధ్యక్షుడు యాదగిరి వచ్చిన సందర్భంగా మాట్లాడారు.ఈ నెల 31న చలో వరంగల్ మందకృష్ణ మాదిగాకు సన్మాన సభ ఉంటుందని ఆ సభను జిల్లాలోని మాదిగా మండల,గ్రామాల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున్న వచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు మొగులయ్య మాదిగా, బుచేంద్ర మాదిగా, దుర్గాదాస్ మాదిగా, శంకర్ మాదిగా పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నిజాంపేట,మే28 కల్వకుంటకు చెందిన గుర్రం మల్లేశం(39) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు.ఈ మేరకు మృతుని అంత్యక్రియల నిమిత్తం వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు నారయణ, సుధాకర్‌రెడ్డి,రాజు రూ.5 వేలు, మాజీ ఎంపీటీసీ చింతల స్వామి తనవంతుగా రూ.5 వేల ఆర్థిక సాయంను బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

## రేణుకామాత విగ్రహ ప్రతిష్ఠ గోడ పత్రిక ఆవిష్కరణ



నర్సాపూర్, మే 28: గొల్లపల్లిలో రేణుకామాత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆలయ నిర్మాణ దాత మల్లేశ్‌గౌడ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29 నుండి జూన్ 1వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీర్వచనాలు పొందాలని కోరారు.

# మల్లెచెర్వు సుందరీకరణ పనులు వేగవంతం



తహసీల్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



మనోహరాబాద్: దండుపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

- ప్రత్యేక నిధులతో త్వరలోనే అభివృద్ధి పనులు
- జూన్ 3 నుంచి 20వరకు రెవెన్యు సదస్సులు
- రామాయంపేట రెవెన్యు సిబ్బంది
- ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట, మే 28: మల్లెచెర్వు సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించి పనులు చేస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం రామాయంపేటకు విచ్చేసిన కలెక్టర్ ముందుగా తహసీల్ కార్యాలయానికి చేరుకుని రెవెన్యు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం అక్కడి నుంచి పనులు నిలిచిపోయిన రెవెన్యు కార్యాలయం, మల్లె చెర్వును సందర్శించి మాట్లాడారు. మల్లె చెర్వును మినీ ట్యాంకుబండ్‌గా సుందరీకరిస్తామన్నారు. ప్రభుత్వం చెర్వు కోసం ప్రత్యేక నిధులు విడుదల చేస్తుందన్నారు. చెర్వులో ఉన్న మురుగును తొలిగించి పనులు చేపడ్తామన్నారు. పట్టణవాసుల కోసం చెరువును శుద్ధి చేసి మురుగు లేకుండా చేస్తామన్నారు. ఇరిగేషన్, మున్సిపల్ సిబ్బందిని పలు వివరాలడిగి తెలుసుకున్నారు. రామాయంపేటలో రెవెన్యు కార్యాలయం పనులను కూడా త్వరలోనే మొదలు పెడ్తామని తెలిపారు. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు రెవెన్యు సదస్సులు ఉంటాయన్నారు. ప్రజలకు సంబంధించిన అర్జీలను పెండింగ్‌లో పెట్టవద్దన్నారు. రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు. కలెక్టర్ వెంట మెదక్ ఆర్డీవో, రామాయంపేట పురపాలిక ప్రత్యేక అధికారి రమాదేవి, తహసీల్దార్ రజినీకుమారి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, ఆర్ఐ గౌస్, ఇరిగేషన్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

### 186 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పూర్తి

మనోహరాబాద్, మే 28: జిల్లాలోని 186 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేశామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మనోహరాబాద్ మండలం దండుపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 2025-26 యాసంగిలో రైతుల నుంచి 2,80,751 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 55,855 మంది రైతులకు రూ. 520.25 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. అకాల వర్షాలకు రైతులు అధైర్య పడవద్దని, రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామన్నారు.

### ఇందిరమ్మ ఇల్లు నమూనా పరిశీలించిన కలెక్టర్

తూప్రాన్, మే 28: ఇందిరమ్మ ఇంటి నమూనా ప్రకారం లబ్ధిదారులు నిర్మించుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. తూప్రాన్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్మిస్తున్న ఇందిర మ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఇంటి లోపల డిజైన్, సౌకర్యాలపై అధికారులకు సూచనలను అందజేశారు. ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నమూనా గృహాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు మోడల్ హౌస్‌ను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హౌసింగ్ పీడీ మాణిక్యం పాల్గొన్నారు.

# క్రీడాప్రాంగణాలపై నీలినీడలు

- వృథాగా క్రీడాపరికరాలు
- బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకంపై నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు, ప్రభుత్వం
- గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో అనాసక్తి




వెల్దుర్తిలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం



వృథాగా ఉన్న క్రీడా పరికరాలు

వెల్దుర్తి, మే 28: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసి వారికి తగిన గుర్తింపుతో పాటు అవకాశాలు కల్పించే లక్ష్యంతో గత ప్రభుత్వం గ్రామగ్రామాననా ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడాప్రాంగణాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకంపై నిర్లక్ష్యంపై వహించడంతో క్రీడాప్రాంగణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఉమ్మడి వెల్దుర్తి మండలంలో 30 గ్రామపంచాయతీలుండగా ప్రతి గ్రామపంచాయతీలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ప్రభుత్వ స్థలాలలో ఏర్పాటు చేశారు. ఈ క్రీడా ప్రాంగణాలలో పలు క్రీడలకు సంబంధించిన పరికరాలను ఏర్పాటు చేయడంతో పాటు గ్రామాలకు క్రీడా కిట్లను సైతం అందజేశారు. వీటితో క్రీడాప్రాంగణాలలో పలు రకాల క్రీడల శిక్షణతో పాటు ఉదయం, సాయంత్రం వ్యాయామాలు చేసేవారికి ఎంతో ఉపయోడకరంగా ఉంటాయని ప్రజలు ఆశించారు. కాని క్రీడా ప్రాంగణాలు పశువులను కట్టేయడానికి, ట్రాక్టర్లు నిలుపడానికి ఉపయోగిస్తుండగా, పలు గ్రామాల్లో క్రీడాప్రాంగణాలు కబ్జాకు గురవుతున్నాయి.

### ప్రభుత్వ భూముల్లో క్రీడాప్రాంగణాల ఏర్పాటు

గ్రామాలలో రెవెన్యూ అధికారులు సర్వేలు చేసి ప్రభుత్వ భూములను గుర్తించగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో స్థలాలను చదునుచేసి, పలు క్రీడా పరికరాలను, పెద్ద బోర్డులను ఏర్పాటు చేసి క్రీడాప్రాంగణాలుగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ భూములు లేని గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల ఆవరణలోనే క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంగణాలలో ఎలాంటి క్రీడలు నిర్వహించకపోవడం, నిర్వహణ లోపంతో క్రీడాప్రాంగణాలలో పిచ్చిమొక్కలు, పొదలతో నిండిపోతున్నాయి. గ్రామ పంచాయతీలకు పంపిణీ చేసిన క్రీడాసామాగ్రి పంచాయతీ కార్యాలయాలలోనే మూలన పడిఉండడం, పలు గ్రామాల్లో క్రీడా పరికరాలు కనిపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా క్రీడాప్రాంగణల నిర్వహణ లేకపోవడం, పట్టించుకోకపోవడంతో పలు గ్రామాల్లో క్రీడాప్రాంగణాలు కబ్జాకు గురవుతున్నాయి.

### వాడుకలోకి తేవాలి

గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి వారి నైపుణ్యాన్ని మెరుగుపర్చే ఉన్నతమైన లక్ష్యంతో గ్రామాలలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలను వాడుకలోకి తేవాలని యువకులు, క్రీడాకారులు కోరుతున్నారు. క్రీడాసామగ్రిని అందజేసి, కోచ్‌లను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చి క్రీడాకారులను తీర్చిదిద్దాలని కోరుతున్నారు. క్రీడాప్రాంగణాలు కబ్జాకు గురికాకుండా హద్దులను గుర్తించి ఫెన్సింగ్ వేసి ప్రాంగణాలు కబ్జాకు గురికాకుండా చూడాలని కోరుతున్నారు.

# నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

కౌడిపల్లి, మే 28: విత్తన దుకాణాల యజమానులు నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఏడీఏ పుణ్యవతి, ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రోమోర్, ఆగ్రోస్ రైతుసేవాకేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులు అమ్మకూడదని అన్నారు. రైతుల అవసరానికి అనుగుణంగా పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీ కింద పంపిణీ చేస్తామన్నారు. డీలర్లు తప్పని సరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ఎరువుల నియంత్రణ చట్టం 1985 నియమ నిబంధనలు పాటిస్తూ పీవోఎస్ మిషన్ ద్వారా మాత్రమే అమ్మకాలు చేయాలన్నారు. ప్రతి రైతు నుంచి ఆధార్‌కార్డు వివరాలు తీసుకొని ఎరువుల విక్రయాలు జరుపాలన్నారు ఈ కార్యక్రమంలో ఏవో స్వప్నజాదవ్ పాల్గొన్నారు.

### నిజాంపేటలో..

నిజాంపేట,మే28: రైతులకు నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ఏవో సోమలింగారెడి, ఇన్‌చార్జి ఎస్సై సృజన అన్నారు. బుధవారం నిజాంపేటలోని సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలతాలుకు రసీదులు డీలర్ల నుంచి పొందలన్నారు.ఎరువుల క్రమ, విక్రయ వివరాలను నమోదు చేయాలన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

చిన్నశంకరంపేట,మే28: నాసిరకపు విత్తనాలు, మందులు, ఎరువులు ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి లక్ష్మీప్రసన్న అన్నారు. బుధవారం మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనికీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈపాస్ మెషిన్‌లు ఆండ్రాయిడ్ వెర్షన్‌ఎల్-1 ద్వారా మాత్రమే ఎరువులు రైతులకు ఇవ్వాలన్నారు.రైతులు ఎరువులు తీసుకున్న సమయంలో ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకొని ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలు రిజిష్టర్‌లో,ఈపాస్ మిషిన్‌లు నమోదు చేయడం ,స్టాక్ బోర్డు రాయడం తప్పనిసరిగా చేయాలన్నారు. అధిక ధరలకు అమ్మిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. పత్తి విత్తనాలు అధిక ధరలకు అమ్మిన వారిపై చర్యలు తప్పవు అన్నారు. రశీదులు తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలని అన్ని రకాల కంపెనీలు ఒకటే అని అన్నారు. నాణ్యమైన విత్తనాలు, కానీ ఇస్తా ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలన్నారు. ఎవరైనా నాసిరకం విత్తనాలు కానీ ఎరువులు పురుగు మందులు అమ్మిన తెచ్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై నారాయణతో పాటు ఎరువుల దుకాణషాప్ యజమానులు ఉన్నారు.

### విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి నాదం కృష్ణ అన్నారు. బుధవారం రైతులకు విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు చేసేసమయంలో తప్పకుండా రశీదు తీసుకొని గడువు ముగిసిన తేదీని చూసుకోవాలన్నారు. విత్తనాలను విత్తన శుద్ధి చేయాలని ఏమైనా సందేహాలుంటే స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు నిఖిల్, వినీత్ ఉన్నారు.

## గోవుల సంరక్షణకు చర్యలు చేపట్టాలి



ట్రైనీ ఎస్ఐ అరవిందకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట, మే 28: గోవుల సంరక్షణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు కోనం విఠల్, శ్రావన్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ ఎస్ఐ అరవింద్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా మెదక్ జిల్లాలో గోవులను అక్రమంగా కబేళాలకు తరలించి వధిస్తున్నారన్నారు. గోవధ చట్టాన్ని ఉల్లంఘించి గోసంతతి యొక్క అక్రమ రవాణా విపరీతంగా పెరిగిందన్నారు. ఆటోలు, లారీలోల్లోనే కాకుండా కంటైనర్‌లలో రావాణా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజెవైఎం నాయకులు బుగుడాల క్రిష్ణ, నాయకులు ఎర్ర శ్రీహరి, రవీందర్ ఉన్నారు.

## కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేత



కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న శివకుమార్‌గౌడ్

శివ్వంపేట, మే 28 : శివ్వంపేట మండలం గూడురు గ్రామంలో నిర్మించిన శ్రీగురుపీఠంలోని శ్రీదత్తాత్రేయమహాస్వామి, శ్రీషిరిడిసాయిబాబా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం జూన్ 2 నుంచి ప్రారంభం కానున్నందున బుధవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు శ్రీగురుపీఠం చైర్మన్ శివకుమార్‌గౌడ్ ఆహ్వాన పత్రిక అందజేశారు. అదేవిధంగా అదనపు కలెక్టర్ నగేశ్‌కు, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ రంగకృష్ణలకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ ట్రస్టు సభ్యులు, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజ్యం భిక్షపతియాదవ్, మొలుగు నాగేశ్వర్‌రావు, కన్నారం దుర్గేశ్, జగన్‌రెడ్డి, సంతోష్ తదితరులు ఉన్నారు.

## లయన్స్ క్లబ్‌కు గుర్తింపు తేవాలి

- ఆయూష్ ఆధ్వర్యంలో హరిత యోగా
- మొక్కలు మొక్కలు నాటిన జిల్లా చైర్మన్ దేమె యాదగిరి

రామాయంపేట, మే 28: రామాయంపేట లయన్స్‌క్లబ్‌ను రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తేవాలని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్టు చైర్మన్ దేమె యాదగిరి, రాజశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు.బుధవారం రామాయంపేట లయన్స్‌క్లబ్ సమావేశం ఏర్పాటు చేసి నూతనంగా ఎంపికైన సభ్యులను అభినందనలు తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రంలోనే రామాయంపేట లయన్స్‌క్లబ్ ముందు వివిధ రంగాల సేవాకార్యక్రమాలలో ముందుందని ఇంకా మనందరం కలిసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపును తేవాలన్నారు. క్లబ్‌లో ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం, అవయవ దానంపై ప్రభుత్వ పాఠశాలల్లో, పంచాయతీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయూష్ శాఖ యోగా గురువు మద్దెల భరత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. లక్ష్మణ్ యాదవ్, వంగరి కైలాస్, జీడి తిరుపతిగౌడ్, స్వామి, దారం రమేశ్, గురువయ్య ఉన్నారు.

## రైతులకు అవగాహన సదస్సు



అహ్మదనగర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

నర్సాపూర్, మే28: మండలంలోని నత్నాయిపల్లి, అహ్మద్‌నగర్ గ్రామాలలో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు రైతులకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు-అన్నదాతలకు అవగాహన అనే కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఎరువుల యాజమాన్యం, యూరియా వాడకం తగ్గించడం, మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం, వరి పత్తి పంట సాగులో తీసుకోవలసిన మెళకువలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.గీత, డా.పద్మశ్రీ శ్రీలత, డా.గాయత్రీ, ఏఈవోలు చంద్రవేణి, తేజస్విని, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్ వోసీ అందజేసిన ఎమ్మెల్యే



బాధిత కుటుంబసభ్యులకు ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

వెల్దుర్తి, మే 28. అనారోగ్యంతో ఉన్న యువతి చికిత్స కోసం రూ.1.70 లక్షల ఎల్‌వోసీని అందజేసి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆర్థికంగా ఆదుకున్నారు. మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన కౌడె అనూష తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స అందిస్తున్నారు. చికిత్స ఖర్చులు భరించే ఆర్థిక స్థోమత బాధిత కుటుంబ సభ్యులకు లేకపోవడంతో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే రూ.1.70 లక్షల ఎల్‌వోసీని సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా మంజూరు చేయించి బుధవారం ఎమ్మెల్యే నివాసంలో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, శేఖర్, శ్రీనివాస్, ఏషయ్యల తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు కంఠారెడ్డి ఆర్థిక సాయం



నిజాంపేట,మే28: నందగోకుల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త అందె మహేశ్‌కు విద్యుత్ షాక్‌కు గురై కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. పిట్ల కళావతి(48) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయాలు తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఒక్కో బాధిత కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం స్థానిక బీఆర్‌ఎస్ నాయకుల ద్వార అందజేశారు. బాల్‌రెడ్డి, హనుమంత్ రెడ్డి, స్వామి, తిరుపతి, సిద్దిరాములు, మల్లయ్య తదితరులు ఉన్నారు.

## బ్యూటీషియన్ కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

నర్సాపూర్, మే 28: 18 నుంచి 45 ఏండ్ల లోపు గల మహిళలకు ఉచితంగా బ్యూటిషియన్ కోర్సు (30 రోజులు) నిర్వహించబడుతుందని అర్హులైన వారు ధరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు సూచించారు. బుధవారం నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రామకృష్ణరావు అధ్యక్షతనలో మెప్మా మరియు నాబార్డ్ వారి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సుకు పదవ తరగతి చదువుకొని ఉండాలని, ఆధార్ జిరాక్స్, పాస్‌ఫోటో మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందికి సమర్పించి పూర్తి వివరాలను పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా మెదక్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇందిరా, మెప్మా సీవో దేవపాల, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వరద కాల్వ పునరుద్ధరణకు చర్యలు



కాల్వ తీయిస్తున్న ఇరిగేషన్ డీఈఈ

వెల్దుర్తి, మే 28. పాఠశాలకు రోడ్డు నిర్మాణం కోసం వరద కాల్వను కబ్జా చేయగా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల ఫిర్యాదు మేరకు స్పందించిన ఇరిగేషన్ అధికారులు బుధవారం కాల్వను పునరుద్దరించారు. ఇరిగేషన్ డీఈఈ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట మండలం రామంతాపూర్ గ్రామశివారు, 44వ జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించిన జాన్ అకాడమీ పాఠశాల యాజమాన్యం జాతీయ రహదారికి ఇరువైపుల వరద నీరు వెళ్లడానికి నిర్మించిన కాల్వను కబ్జా చేసి పాఠశాలకు రోడ్డును నిర్మించారు. దీంతో గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు వరద నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో రహదారి కుండిపోయే ప్రమాదం ఉందని గమనించిన ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఇరిగేషన్ అధికా రులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం డీఈఈ రాజేందర్, ఏఈ రాజేష్‌లు సిద్దార్థలు జేసీబీ సాయంతో వరదనీరు సాఫీగా వెళ్లేలా కాల్వ తవ్వించారు. మరోమారు కాల్వ కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కబ్జాదారులను వారు హెచ్చరించారు.

## ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి



రాజు మృతదేహం వద్ద రోదిస్తున్న బాధిత కుటింబీకులు

చిన్నశంకరంపేట,మే28ఃద్విచక్రవాహనం అదుపుతప్పి రైల్వే బ్రిడ్జికి ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మిర్జాపల్లిలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మిర్జాపల్లి గిరిజన తండా కాట్రోత్ రాజు (36) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. పని నిమిత్తం నార్సింగ్‌కు వెళ్లి తన స్వగ్రామం మిర్జాపల్లి గిరిజన తండాకు వస్తుండగా మిర్జాపల్లి వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి దగ్గరికి రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య చాంగి, ఒక కుమారుడు ఉన్నారు. ఈ విషయంపై చిన్నశంకరంపేట ఎస్సై నారాయణను ప్రశ్నించగా తనకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

## విద్యార్థులకు కెరీర్‌గైడ్స్‌పై అవగాహన

పెద్దశంకరంపేట,మే28: పెద్దశంకరంపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థినులకు భవిష్యత్తులో ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ కెరీర్ గైడెన్స్‌పై తదితర అంశాలపై ఎంఈవో వెంకటేశం అవగాహన కల్పించారు. పదవతరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు ఘనంగా సన్మానించారు.

## వర్షానికి తడిసి.. మొలకలొచ్చి

- అకాల వర్షానికి తడిసి ముద్దవుతున్న కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం
- తడిసిన ధాన్యం మిల్లులకు పోతే బస్తాకు మూడు, నాలుగు కిలోల తరుగు అడుగుతున్న రైస్ మిల్లు యజమానులు





చిలిపిచెడ్,మే 28ఃమండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చిట్కుల్,చండూర్,చిలిపిచెడ్ గ్రామాల్లో ని కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచిన ధాన్యం తడిసిపోయింది.కేంద్రాల నిర్వాహకులు వడ్లను త్వరంగా తూకం వేయకపోవడంతో రైతులు వడ్ల కుప్పల వద్దే రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు.వడ్లను అరబెట్టి..కొనుగోలు కేంద్రానికి తీసుకవస్తే త్వరగా తూకం వేయడం లేదు.తూకం వేయిసిన బస్తాలకు లారీలు రావడం లేదు అని రైతులు ఆవేదన చెందుతున్నారు.లారీలు నింపిన బస్తాలు రైస్ మిల్లులకు పంపుతే రైస్ మిల్లు యాజనులు తేమ శాతం ఎక్కువ ఉందని, మొలకలొచ్చినవి అని ఏదో ఒక మంట చెప్పి రైతుల నుంచి తూకం వేసిన బస్తాకు రెండు నుంచి మూడు కిలోలు ధాన్యం ఇస్తే లారీ ఖాళీ చేస్తాం లేదాంటే మరో రైస్ మిల్లుకు లారీ తీసుకొని వెళ్లిపో అంటు రైస్ మిల్లు యాజమనులు రైతులను ఇబ్బందులకు గురిచేసి ధాన్యం తీసుకుటున్నారని రైతులు వాపోయ్యారు.ఐకేపీ,తహసీల్ధార్‌లు ఫోన్ చేసిన పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు.ఇప్పటికైన అధికారులు స్పందించి రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.